క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

కేతేపల్లి: మండలంలోని రైతులకు 2024 వానాకాలం పంట సాగుకు అవసరమైన జీలుగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు కేతేపల్లిలోని సహకార సంఘం భవనంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా ధర రూ.1116 నిర్ణయించినట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌లను తీసుకుని సంబంధిత ఏఈఓలను వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పచ్చిరొట్టను పూతదశలో నేలలో కలియదున్నడం వల్ల నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి భూసారం పెరుగుతుందన్నారు.

నేడు నల్లగొండలో బండి సంజయ్ పర్యటన

చిట్యాల: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించేందుకు శనివారం ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ నల్లగొండలో పర్యటించనున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

హరికృష్ణకు అవార్డు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన మేడి హరికృష్ణ ఆసరా స్వచ్ఛంద సంస్థ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలకు గాను మాతృదేవోభవ-పితృదేవోభవ ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా బెస్ట్ సర్వీస్ మహనీయుల అవార్డును హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

పలువురి కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

చిట్యాల: పట్టణంలోని పలు మృతుల కుటుంబాలను శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆవుల శ్రీశైలం మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.అదేవిధంగా చనిపోయిన పాల లింగస్వామి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పాముకాటుకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పట్టణ నాయకుడు పోశబోయిన నర్సింహ, అనారోగ్యానికి గురైన నూనె శ్రీనివాస్‌ను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, అంజనేయులు, ఎస్‌కె.ఇబ్రహీం ఉన్నారు.

కోరం లేక ఎంపీపీ ఎన్నిక వాయిదా

చండూరు : కోరం లేకపోవడంతో చండూరు ఎంపీపీ ఎన్నికను ఆర్‌డీఓ సుబ్రమణ్యం శనివారానికి వాయిదా వేశారు. గత ఏప్రిల్‌లో ఎంపీపీ పల్లె కళ్యాణిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆ సీటు ఖాళీ అయ్యింది. వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న అవ్వారి గీతా శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఎంపీపీ ఎన్నికకు హాజరు కావాలని అధికారులు సభ్యులకు నోటీసులు అందించారు. పది మంది సభ్యులకు గాను బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. కోరం లేక పోవడంతో తిరిగి శనివారానికి వాయిదా వేస్తున్నట్లు ఆర్‌డీఓ ప్రకటించారు.


విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నకిరేకల్ : విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. ఈ ఘటన నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన మచ్చపోతుల అబ్బయ్యకు చెందిన కోడె గిత్తలు, ఇతర పశువులను మేత కోసం రోజు వారీగా గ్రామ శివారుకు తోలుకెళ్లారు. అందులో ఓ ఎద్దు మేతమేసుకుంటూ రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందిందని బాధితుడు తెలిపాడు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

కనగల్ : మండల పరిధిలోని ఎంఆర్‌సీ భవనంలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్య పుస్తకాలను శుక్రవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ తరి రాములు అందజేశారు. అదేవిధంగా ఏపీఎం సంకు హరి ఆధ్వర్యంలో శ్రీ శక్తి భవనంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని ఎంఈఓ పరిశీలించారు.

సీఎంను కలిసిన మాజీ జెడ్పీటీసీ



సీఎంతో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అల్లుబెల్లి రవీందర్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

కూలి గిట్టుబాటు అయ్యేదెలా !

- విద్యార్థుల ఒక్కో యూనిఫాం కుడితే ప్రభుత్వం చెల్లించేది రూ.50 మాత్రమే
- దారం, గుండీలు, ఇతరత్ర ఖర్చులే రూ.25 అవుతుందంటున్న మహిళా సంఘాల సభ్యులు
- ఒక్కో జతకు రూ.200 చెల్లించాలని డిమాండ్



మునుగోడు : పాఠశాలలో యూనిఫాంలు కుడుతున్న మహిళలు

మునుగోడు: గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న దుస్తులను మహిళా సంఘాల చేత కుట్టించాలని నిర్ణయించింది. అందుకు అవసరమైన క్లాత్‌ని సైతం మండల కేంద్రాల్లోని సంఘమిత్ర కార్యాలయాలకు సరఫరా చేసింది. ఒక్కో యూనిఫాంకు కేవలం రూ.50 మాత్రమే చెల్లిస్తామని చెబుతున్నారు. దీంతో తమకు కనీసం రోజువారీ కూలి గిట్టుబాటు కావడం లేదని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు.

రూ. 50లోనే దారం, గుండీల ఖర్చు

యునిఫాం కుట్టేందుకు మహిళా సంఘాల సభ్యులకు జతకు ఇచ్చే రూ.50లోనే దారం, జిప్, గుండీలు, తదితర వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇలా ఒక్కో జతకు స్టేషనరీ ఖర్చులు రూ.15కు పైగా ఖర్చు అవుతుంది. దీంతో ఒక జత కుడితే రూ. 35వరకు మాత్రమే మిగులుతుంది. ఇక యూనిఫాం కటింగ్ చేయిస్తే ఒక జతకు రూ.10 ఇవ్వాల్సి ఉంటుంది. అలా ఒక జతకు రూ.25 ఖర్చులు పోను రూ. 25 మాత్రమే మిగులుతుంది. ఒక్కో మహిళ 12 గంటల పాటు శ్రమిస్తే ఐదు నుంచి ఆరు జతలను మాత్రమే కుట్టకల్గుతామని చెబుతున్నారు. అంటే రోజుకు ఒక్కొక్కరి ఆదాయం రూ. 150 మాత్రమే వస్తుంది.

మార్కెట్‌లో జతకు రూ.500

గ్రామాల్లో ఇంటి వద్ద టైలర్ దుకాణం పెట్టుకుని దుస్తులు కుడితే ఒక జతకు రూ. 500ల చొప్పున తీసుకుంటున్నారు. నాణ్యమైన స్టేషనరీ వినియోగించినా జతకు రూ.50 నుంచి రూ.80 వరకు ఖర్చు అవుతాయి. మిగిలిన రూ.420 కుట్టినవారికి గిట్టుబాటు అవుతుంది. అలా రోజుకు కేవలం రెండు జతలు కుట్టుకున్న రోజుకి రూ. 800ల ఆదాయం వస్తుందని, అదే ప్రభుత్వం ఇచ్చిన దుస్తులు కుడితే కనీసం అందులో సగం ఆదాయం కూడా రావడం లేదని చెబుతున్నారు. దీంతో అనేక మంది మహిళలు యూనిఫాంలు కుట్టేందుకు ముందుకు రావడం లేదు. జూన్ 4వ తేదీ వరకు విద్యార్థుల యూనిఫాంలను కుట్టించి ఆయా పాఠశాలలకు పంపాలని ఉన్నత అధికారులు సంఘమిత్ర సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏపీఎం, సీసీలు నాలుగు, ఐదు గ్రామాల మహిళా సంఘాల సభ్యులను ఒక యూనిట్ చొప్పున ఏర్పాటు చేసి కుట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, తమకు ఒక్కో యూనిఫాంకు రూ.200 చెల్లించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

మునుగోడు మండలంలో..

మునుగోడు మండల వ్యాప్తంగా ప్రభుత్వం ప్రైమరీ, ప్రాథమికోన్నత, ఉన్నత, రెసిడెన్షియల్ పాఠశాలు కలిపి మొత్తం 41ఉన్నాయి. వీటిలో 3,266 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున 6,532 యూనిఫాం అందించాల్సి ఉంటుంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాంలు మహిళా సంఘాల సభ్యులతో కుట్టించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక జత కుడితే రూ. 50 చెల్లిస్తామని పేర్కొంది. అందులోనే స్టేషనరీ ఖర్చులు కూడా భరించాలి. కానీ కొందరు మహిళలు జతకు రూ.200 చెల్లించాలని కోరుతున్నారు. వారి డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– మహేశ్వర్‌రావు, ఏపీఎం, మునుగోడు

ఒక్కో యూనిఫాంకు రూ. 200 చెల్లించాలి



ఒక్కో యూనిఫాం కుడితే రూ.50 మాత్రమే చెల్లిస్తామంటున్నారు. రోజంతా కుడితే రూ. 150 మాత్రమే వస్తుంది. బయటి మార్కెట్‌లో ఒక జతకు దాదాపు రూ. 500లు ఉంటే ప్రభుత్వం కేవలం రూ. 50 మాత్రమే అందించడం సరైంది కాదు. కనీసం ఒక్కో యూనిఫాంకు రూ. 200లు చెల్లించాలి.

– శోభారాణి, మహిళా సంఘం సభ్యురాలు, మునుగోడు

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే మందుల సామేల్



శాలిగౌరారం : మాట్లాడుతున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం : అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో అనతి కాలంలోనే ఐదింటిని అమలు చేసి ప్రజల మన్ననలు పొందినట్లు పేర్కొన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తొమ్మిదన్నర సంవత్సరాలు పాలన సాగించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీటీరోడ్లను మట్టిరోడ్లకంటే అధ్వానంగా మార్చిందన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుచడంతోపాటూ ఐదు గ్రామాలకు సాగునీటిని అందించేందుకు నిర్మాణంలో ఉన్న ఆసిఫ్‌నహర్ కాలువను సత్వరమే పూర్తిచేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, పాదూరి శంకర్‌రెడ్డి, బండపల్లి కొమరయ్య, చింత ధనుంజయ్య, గూని వెంకటయ్య, నర్సింహ, నరేశ్, శ్రీను, దేవేందర్, రవి, నగేశ్, కృష్ణ, సైదులుపాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండ : ఉద్యోగిని ఓటు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పట్టభద్రులను కోరారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం నల్లగొండ పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగులను ఓట్లు అభ్యర్థించారు. బ్లాక్‌మెయిల్ చేసి, భూదందాలకు పాల్పడే వారికి ఓటు వేయకుండా మండలిలో ప్రశ్నించే గొంతును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, కంచనపల్లి రవీందర్‌రావు, వట్టిపల్లి శ్రీనివాస్, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, మెరుగు గోపి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం..

బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఉద్యోగులు, నిరుద్యోగుల, ప్రజల పక్షాన కొట్లాడి ప్రశ్నించే గొంతు అని మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డిఅన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, సతీష్, బండ మధుసూదన్‌రెడ్డి, లెంకల వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే సమస్యలు పరిష్కారం

- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల మహేందర్

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలు మరోసారి నమ్మి మోసపోవద్దని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని జిల్లా గ్రంథాలయం, ఎల్పీటీ మార్కెట్, పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి బీజేపీ అభ్యర్థికి ఓటేయాలని అభ్యర్థించారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం 40 ఏళ్లుగా పోరాడుతున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాఖీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, ప్యాట అశోక్, నెమ్మది మహేష్, శివయాదవ్, రేవల్లి కిరణ్, లోహిత్‌రెడ్డి, సైదులు, శాంతి స్వరూప్, దేవి పాల్గొన్నారు.

చండూరు : పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ చండూరు మున్సిపాలిటీ ఆఫీస్, రిజిస్ట్రేషన్ కార్యాలయం, బ్యాంకులు, ఎస్‌టీఓ, తహసీల్దారు, ఆర్డీఓ, ఎంపీడీఓ కార్యాలయాల్లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దూడల భిక్షం, సోమ నర్సింహ, కోమటి వీరేశం, పందుల సత్యం గౌడ్, ముదిగొండ ఆంజనేయులు, వనం మదన మోహన్, రావిరాల శ్రీను, తడకమళ్ల శ్రీధర్, భూతరాజు శ్రీహరి, పిన్నింటి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రేమేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

చిట్యాల: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ చిట్యాల మున్సిపాలిటీ, ఉరుమడ్ల గ్రామాల్లో బీజేపీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ అందె బాబయ్య శుక్రవారం పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, చిట్యాల మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహ, చిట్యాల పట్టణ అధ్యక్షుడు శ్రీను, ప్రధాన కార్యదర్శి గంజి గోవర్దన్, పీక వెంకన్న పాల్గొన్నారు.

కేతేపల్లి మండలంలో..

కేతేపల్లి: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం మండలంలోని ఇనుపాముల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాచకొండ గోపి, గద్దం వేణుగోపాల్‌రెడ్డి, పగిళ్ల దామోదర్, నర్సింహాచారి పాల్గొన్నారు.

గౌడ సంఘం కోతులారం అధ్యక్షుడిగా ప్రభాకర్ గౌడ్



మునుగోడు: మండలంలోని కోతులారం గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా ఆ గ్రామానికి చెందిన కందుల ప్రభాకర్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఆ గ్రామంలోని గౌడ కులస్తులు సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కందుల నర్సింహ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జాజుల రమాకాంత్ గౌడ్, కోశాధికారిగా బత్తుల రవి గౌడ్, ఉపాధ్యక్షుడిగా కందుల బాలరాజు గౌడ్, సహాయ కార్యదర్శిగా కందుల కృష్ణగౌడ్, గౌరవ సలహాదారుడిగా గుండు రవి గౌడ్‌తో పాటు మరో 16 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

నార్కట్‌పల్లి : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. వాహనాదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని వినతి

నార్కట్‌పల్లి : ఎల్‌ఐసీ ఏజెంట్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ఎల్‌ఐసీ ఏఓఐ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు నలపరాజు సైదులు కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో సంస్థ సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ మేనేజర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఏజెంట్లకు సంస్థ ద్వారా గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. వీరి వెంట డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రవికుమార్, బండారు రామలింగయ్య, ప్రజ్ఞాపురం శివశంకర్, ధనంజయరావ్, వెంకన్న, మహేశ్వరి, యాదయ్య, లింగయ్య, సైదులు, పృథ్వీ ఉన్నారు.

భూ తగాదాలో ఘర్షణ.. నలుగురికి గాయాలు

శాలిగౌరారం: భూ తగాదాల కారణంగా ఇరు కుటుంబాలు ఘర్షణ పడటంతో నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని భైరవునిబండ గ్రామంలో శుక్రవారం జరిగింది. భైరవునిబండ గ్రామానికి చెందిన బొమ్మలపల్లి లింగయ్య, బొమ్మలపల్లి వీరయ్య వరుసకు అన్నదమ్ములు. గ్రామంలో వీరికి ఉన్న నాలుగు ఎకరాల భూమికి బాట విషయంలో రెండేళ్లుగా తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఇదే విషయంపై జరిగిన గొడవలో వారు పరస్పరం కర్రలు, గొడ్డళ్లతో దాడులు చేసుకున్నారు. దాడుల్లో బొమ్మలపల్లి లింగయ్య, అతని భార్య సుజాత, వీరయ్య అతని భార్య మల్లమ్మకు గాయాలయ్యాయి.లింగయ్య, సుజాతను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి, బొమ్మలపల్లి వీరయ్య, మల్లమ్మలను నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. వీరిలో లింగయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

డీఎస్పీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

మర్రిగూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజన విద్యావంతులందరు ఏకం కావాలని దళిత సమాజ్ పార్టీ జిల్లా కోకన్వీనర్ నక్క గిరిమహారాజ్ అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యావంతులు, ప్రజాస్వామ్య ప్రేమికులందరు డీఎస్పీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి దుర్గాప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వినోద్, నాయకులు జగన్, రాజు, లక్ష్మణ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మేలురకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



కేతేపల్లి: చీకటిగూడెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న నకిరేకల్ ఏడీఏ రామారావునాయక్



చండూరు : శిర్దేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



శాలిగౌరారం : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సౌమ్యశృతి

కేతేపల్లి: రైతులు మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకుని వ్యవసాయం సాగుచేయాలని నకిరేకల్ వ్యవసాయశాఖ ఏడీఏ రామారావునాయక్ సూచించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మండలంలోని చీకటిగూడెం, భీమారం, ఇనుపాముల గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. దుకాణదారుడి నుంచి రశీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రశీదుపై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, లాట్ నంబర్, గడువు తేదీ, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్ల బిల్లులను పంటకాలం పూర్తయ్యేంత వరకు దాచుకోవడం వల్ల మొలక శాతం తక్కువైనప్పుడు తగిన పరిహారం కోరే హక్కు రైతుకు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఏఓ బి.పురుషోత్తం, ఏఈఓలు బాలరాజు, వీరేష్, ఉమేష్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి

మర్రిగూడ: ఫెస్టిసైడ్ విత్తన దుకాణాదారులు నియమ నిబంధనలు పాటిస్తూ ఎమ్మార్పీకే రైతులకు విత్తనాలు విక్రయించాలని మునుగోడు ఏడీఏ ఎల్లయ్య అన్నారు. శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మన గ్రోమోర్ పలు ఫెస్టిసైడ్ దుకాణాల్లోని పత్తి విత్తనాల ప్యాకెట్లు, రిజిస్టర్లు, బిల్లులను పరిశీలించారు. ఆయన వెంట విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నల్లగొండ సీఐ ఎస్‌కె.గౌస్, కె.రాంబాబు, ఏఈఓ విజయ్‌కుమార్ ఉన్నారు.

విత్తనాల ఎంపికపై అవగాహన

చండూరు : లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ షాప్‌లలోనే రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఈఓ భూతరాజు నాగార్జున సూచించారు. ఆయన శుక్రవారం శిర్దేపల్లి గ్రామంలో రైతులకు పత్తి విత్తనాల ఎంపికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట, జీలుగ సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు కటిక శ్రీనివాస్ రెడ్డి, కామిశెట్టి ఆంజనేయులు, బొల్లం బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలి

మునుగోడు: ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రైతులకు విత్తనాలు విక్రయించాలని మండల వ్యావసాయ అధికారి ఎస్.శ్రీనివాస్‌గౌడ్ డీలర్లకు సూచించారు. శుక్రవారం ఆయన మునుగోడులోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను గఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాపారులకు పలు సూచనలు చేశాడు. రైతులకు విక్రయించిన విత్తనాలకు విధిగా రశీదు ఇచ్చి సంతకాలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఓలు ఉన్నారు.

విత్తనాల ఎంపికే కీలకం

శాలిగౌరారం: పంటల సాగులో విత్తన ఎంపికే కీలకమని మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి అన్నారు. మండలంలోని చిత్తలూరు, వంగమర్తి గ్రామాల్లో శుక్రవారం ఆమె క్షేత్రపరిశీలన చేశారు. ఈ సందర్భంగా చిత్తలూరు గ్రామంలో పత్తిచేను సాగుకు దుక్కులను సిద్ధం చేసుకుంటున్న రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఆమెవెంట ఏఈఓ కీర్తి, రైతులు, కూలీలు ఉన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం



నల్లగొండ : ప్రచారం నిర్వహిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నల్లగొండ : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ శుక్రవారం నల్లగొండలో ప్రచారం నిర్వహించారు. మున్సిపల్, జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులను, గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం పీఆర్‌టీయూ ఉద్యోగులను కలిసి మల్లన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు. అదే విధంగా పట్టణంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రులను కలిసి మల్లన్నకు మద్దతివ్వాలని కోరారు.

మల్లన్నకు మద్దతుగా ప్రచారం

చిట్యాల: నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు జీటీఏ (గవర్నమెంట్ టీచర్ అసోసియేషన్) ఉపాధ్యాయ సంఘం మద్దతునిస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దూదిగామ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులంతా తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు.

తీన్మార్ మల్లన్నకు మద్దతు

కనగల్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సీపీఎం మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి కందుల సైదులు, సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి తెలిపారు. శుక్రవారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు మద్దతు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు.

మర్రిగూడ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క తిరుపతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఆయన వెంట కొట్టం శ్రీనివాస్, యాదయ్య, నరసింహ, శ్రీను తదితరులు ఉన్నారు.

భాగవత పారాయణం చేస్తే బాధలు తొలగుతాయి





ప్రవచిస్తున్న అష్టాక్షర జీయర్ స్వామి, పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): భాగవతం పారాయణం చేస్తే బాధలు తొలగుతాయని త్రిదండి అష్టాక్షరి స్వామి అన్నారు. నల్లగొండలోని రామగిరి అక్కినేపల్లి శ్రీదేవిలక్ష్మణరావు నివాసంలో శుక్రవారం నిర్వహించిన భాగవత సప్తాహం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన భాగవత ప్రవచనం చేశారు. కార్యక్రమంలో శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తులు రామకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

‘నాకంటి పాప’ ప్రోమో విడుదల



నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో ప్రోమో విడుదల చేస్తున్న నాయకులు

నల్లగొండ: విక్టరీ మ్యూజిక్ యూట్యూబ్ చానల్ ఆధ్వర్యంలో నా కంటిపాప (అమ్మ)సాంగ్ ప్రోమోను మంత్రి కోమటిరెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, 4వ వార్డ్ కౌన్సిలర్ ఆనంద్ చేతుల మీదుగా శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సృష్టిలో అమ్మ ప్రేమ ఎంతో స్వచ్ఛమైనదని అన్నారు. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కేశరాజుపల్లికి చెందిన ఊట్కూరి శ్రవణ్ కుమార్ మొదటిసారిగా అమ్మపై పాట చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కోడైరెక్టర్ బేరాజ్, కాంగ్రెస్ నాయకులు జూలకంటి సైదిరెడ్డి, పోలె జయకుమార్, పెరిక అంజయ్య, గాలి నాగరాజు, కాసాని శంకర్, పాదం అనిల్, సిద్దు పాల్గొన్నారు.

చింతగూడెం వాసికి డాక్టరేట్



ఉదయ్‌కుమార్

హాలియా : అనుముల మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన మీసాల ఉదయ్‌కుమార్ డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య వెలుదండ నిత్యానందంరావు పర్యవేక్షణలో ‘పెద్దింటి అశోక్ కుమార్ నవలలు సమగ్ర పరిశీలన’ అనే అంశంపై మీసాల ఉదయ్‌కుమార్ పరిశోధన చేశారు. దీనికి ఉస్మానియావిశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించిందని తెలిపారు. 2017లో యూజీసీ నెట్ ద్వారా దేశంలోని ఉత్తమ ర్యాంకుతో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జెఆర్ఎఫ్)కు ఎన్నికై పరిశోధనను ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కళాశాల బాయ్స్) తెలుగు ఉపాధ్యాయుడిగా ఉదయ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య రవీందర్, శాతవాహన విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య సంకుసాల మల్లేశం, మామా మల్లెల నర్సింగ్‌రావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఆచార్య గోననాయక్, రిటైర్డ్ ఓయూ ఓఎస్‌డీ క్రిష్టారావు, ఓయూ తెలుగు ప్రొఫెసర్ ఆచార్య సూర్యధనుంజయ్, లింగప్ప, సీత లక్ష్మికి ఉదయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.